# నిరంతర జపమాల ప్రార్థన

**ప్రియ విశ్వాసులారా !**

బంగాళాఖాతం తీరం మెడలో మణిహారమై వెలుగుతున్న విశాఖపట్నం లోని రోస్‌హిల్ కొండపై శతాబ్దిక సంవత్సరాల నుండి నిష్కళంక హృదయ మాత విశాఖపురిమేరిమాత పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతుంది. దీనికి అనుబంధంగా రాజిల్లుతున్న విశాఖ రోస్‌హిల్ ప్రార్థనా సహవాస బృందంవారు, పరిశుద్ధాత్మ ప్రేరణతో, 25 సం॥ల క్రిందట 1995లో "నిరంతర జపమాల ప్రార్థన" అను ప్రార్థనా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఇది **నిరంతర జపమాల ప్రార్థన ఉద్యమ రజిత జూబిలీ సంవత్సరము.** ఈ గొప్ప ఆధ్యాత్మిక ఉద్యమంను అంచెలంచెలుగా ఆత్మీయ వృద్ధితో దీవించి నందుకు కృపగల దేవునకు సదా కృతజ్ఞతలు చెల్లిస్తున్నాము. జపమాల పరమ రహస్యములను ధ్యానించి, పరలోక ఆనందానుభూతుని పొందుటకు అణువైన ఆధ్యాత్మిక వాతావరణంను పవిత్ర విశాఖపురి మేరిమాత పుణ్యక్షేత్రం ఆత్మీయ దాహం కలిగిన భక్తులకు నిత్యం కల్పిస్తున్నది. ఈ ప్రార్థనా ఉద్యమంను ఆశీర్వదించి నిరంతర ప్రోత్సాహాన్నిచ్చిన అప్పటి విశాఖ అగ్రపీఠాధిపతులు స్వర్గీయ **ఘన॥ డా॥ కాగితపు మరియదాసు,** MSFS మరియు నేటి అగ్రపీఠాధిపతులు **ఘ॥ శ్రీశ్రీశ్రీ డా॥ మల్లవరపు ప్రకాశ్‌గారికి** ఋణపడి వున్నాము. ఈ ప్రార్థనా ఉద్యమ ప్రారంభ స్థాయిలో అనేక వ్యయ ప్రయాసలకు లోనై నిస్వార్థంగా అకుంఠిత దీక్షతో కృషిచేసి ముందుకు సాగిన మొదటి సభ్య బృందాన్ని కృతజ్ఞతలతో గుర్తిస్తూ మెచ్చుకొంటున్నాము. అసంఖ్యాక గురువులు, మఠవాసులు, గృహస్థ క్రైస్తవులు, గొప్ప ఉత్సాహంతో పాల్గొని, ఈ నిరంతర జపమాల ప్రార్థన ఉద్యమం ఒక ప్రభంజనంగా రూపుదిద్దుకొనడానికి సహకరించారు. వారందరికీ మా కృతజ్ఞతలు.

**జపమాలను మనం ఎందుకు జపించాలి ?**

భౌతికవాదము, ఉపయోగితావాదం, అనైక్యత, ప్రాణాంతక వ్యాధులు, మానసిక అపరిపక్వత, అభద్రత, ఉగ్రవాదము, వాతావరణ అసమతుల్యత, ముక్కలయిన కుటుంబములు, బాధ్యతారాహిత్య పిల్లలు, పౌరులు, మానవీయ-నైతిక-మత-ఆధ్యాత్మిక విలువల క్షీణత మున్నగునవి నేడు మనం జీవిస్తున్న ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న చీడలు. సమాజంలోను, కుటుంబాలలోను, హృదయాలలోను శాంతిని నింపుకొనడానికి జనం శత విధాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రపంచానికి దైవకృప అత్యవసరము. శోకసంద్రమైన మన ఈ ప్రపంచానికి సరియైన పరిష్కారం జపమాల ప్రార్థన. పరిశుద్ధ జపమాలను జపించుటవలన ఆత్మలను దేవుని దరికి చేర్చు అవకాశము, పాపానికి దూరముగా నుండడానికి అవకాశము కలదు. జపమాల ప్రార్థనము దైవరాజ్యాన్ని మన మధ్య ఆవిష్కరిస్తుంది. మన విశ్వాస యాత్రలో పెడదారులు త్రొక్కకుండా మన అడుగులను క్రమపరుస్తూ, పరలోకంవైపు మనలను నడుపుతుంది. కుటుంబాలలో, సమాజాలలో, భక్తసంఘాలలో జపమాలను జపించు బిడ్డల కోసం దేవమాత నిత్యం ప్రార్థిస్తుంది. ఉత్తరించు స్థలం నుండి ఆత్మల విడుదలకు కూడా జపమాల ఖచ్చితమైన సాధనం. పరమ పవిత్ర యేసు హృదయానికి మరియమాత నిష్కళంక హృదయం ద్వారా మన ప్రపంచాన్ని అంకితమొనర్చుటకు జపమాల సహాయపడుతుంది. ఈ విధంగా భక్తిపూర్వకంగా జపమాలను ధ్యానపూర్వకముగా జపించుట ప్రస్తుత కాలంలో అత్యవసరమని మనం చెప్పగలం.

నిరంతర జపమాల ప్రార్థన రజిత జూబిలీ సంవత్సరంను మనం కొనియాడుచున్న ఈ తరుణంలో పునీత రెండవ జాన్ పౌలుగారి మాటలను స్మరించుకొందాం: "సమాజంలో నున్న చెడును తరిమికొట్టు వాడిగల ఆత్మీయ ఆయుధం జపమాల" 12వ భక్తినాథ పాపుగారు కూడా ఇదే పంథాలో, ఆయన జీవిత కాలంలో నొక్కి చెప్పారు: "మీరు జపమాలను కలిసి జపించినచో, మీ కుటుంబాలలో మీరు శాంతిని అనుభవిస్తారు. మీరు కలిసికట్టుగా ముందుకు సాగుతారు." అందువలన, శక్తివంతమగు ఈ నిరంతర జపమాల ప్రార్థననెడు ఉద్యమమును పునరుత్తేజంతో మనకు తెలిసిన వారందరికి పరిచయం చేయడానికి పాటుపడదాం. జపమాలద్వారా కుటుంబాలలో జరుగు ఆత్మీయ అద్భుతాన్ని, ప్రత్యేకించి, ఐక్యత - అనురాగం - శాంతి సౌభాగ్యాల గురించి వారికి తెలియ చేద్దాం.

**నిరంతర జపమాల ప్రార్థనను ఎట్లు చెప్పాలి ?**

మీరుండే స్థలంలోనే, పగటిపూట గాని, రాత్రిపూట గాని, మీకు అనువైన ఒక గంటను ఎన్నుకొని జపమాలను భక్తితో జపించాలి. ఈ గంటను జపమాల మాసం అక్టోబరులో క్రమం తప్పకుండా ప్రతీరోజు జపించాలి. ఒక్కో పది పూసల దేవరహస్యాన్ని ఇవ్వబడిన ఉద్దేశ్యం నిమిత్తం అర్పిస్తూ జపించాలి. వ్యక్తిగతంగా ఒక్కొక్కరుగా గాని, కుటుంబంగా గాని, మిత్ర బృందంగా గాని జపించవచ్చును. మీరు ఎంపిక చేసుకొన్న ప్రార్థన సమయాన్ని తపాలా ద్వారా, ఈ-మెయిల్ ద్వారా గాని సెప్టెంబరు నెల ఆఖరులోగా తెలియపరచండి. ఈ విధంగా, ప్రపంచ శ్రీసభ అత్యవసరాల నిమిత్తం రేయింబవళ్ళు ప్రార్థించడానికి పెద్ద సంఖ్యలో మనం చేతులు కలుపగలుగుతాం. ప్రయత్నించండి, పాల్గొనండి. మీ హృదయంలో, మీ యింటిలో, మీ ఊరులో, మీ విచారణలో ఈ ప్రపంచంలో దేవుని దీవెనల జల్లులు కురిపించ చేతులు కలపండి.

**రాస్‌హిల్ కొండగుడిపై పరిశుద్ధ జపమాల పండుగ**

1995 అక్టోబరులో పరిశుద్ధ నిరంతర జపమాల ప్రార్థన ప్రారంభించినపుడు మేము పరిశుద్ధ జపమాలమాతను మా పాలక పునీతురాలుగా నెంచుకొన్నాము. అప్పటి నుండి ప్రతీయేట అక్టోబరు నెల 7వ తేదీన జపమాల మాత పండుగను రాస్‌హిల్ కొండగుడిపై ఒక పూర్తి రోజు మరియతల్లి ఔన్నత్యమును గూర్చి ఉపవాస ప్రార్థనను భక్తియుతంగా, ఒక వేడుకగా నిర్వహించుచున్నాము. **నిరంతర జపమాల ప్రార్థన రజిత జూబిలీ సందర్భంగా ఈ సంవత్సరం త్రిదిన ప్రార్థనలను, అక్టోబరు 5, 6 మరియు 7వ తేదీలలో నిర్వహించు చున్నాము.**

జపమాలమాత విజ్ఞాపన ప్రార్థనా సహాయంవలన సిద్ధించు దేవుని అపార కృపకు పాత్రులగుటకు ఈ సదస్సులలో పాల్గొన రమ్మని మిమ్ము సాదరంగా ఆహ్వానిస్తున్నాము. ఈ సదస్సు క్రింది క్రమంలో నిర్వహించబడును.

**అక్టోబరు 5, 2019 - శనివారం**

ఉ॥ 10 నుండి మధ్యా॥ 3 గం॥ల వరకు - తెలుగులో ప్రార్థనలు.

**అక్టోబరు 6, 2019 - ఆదివారం**

ఉ॥ 10 నుండి మధ్యా॥ 2 గం॥ల వరకు - ఇంగ్లీషులో ప్రార్థనలు.

**అక్టోబరు 7, 2019 - సోమవారం**

ఉ॥ 10 నుండి మధ్యా॥ 4 గం॥ల వరకు - తెలుగులో ప్రార్థనలు.


ధ్యానాంశం : **"మరియ - ఆదర్శ వేద ప్రచారకురాలు."**

**"ఆత్మ ప్రేరణను అనుసరించి అన్ని సమయములందును ప్రార్థింపుడు. కనుకనే పట్టుదలతో మెలకువగా ఉండుడు. దైవ ప్రజలందరి కొరకై సదా ప్రార్థింపుడు." (ఎఫేసీ. 6:18)**

# విన్నపములు 2019-20




1. ఫ్రాన్సిస్ జగద్గురువులు, మరియు సువార్త పరిచర్యకు అంకితమైన వారందరు మరియమాత ప్రభునిపట్ల చూపిన సంపూర్ణ దాసోహతత్వంను అంకితత్వంను అనుసరించు నటుల ప్రార్థించుదము.

2. జీవిత సర్వ అంతస్తులలోని వారందరు సోదర భావంతో కూడిన ఆదరణను, ప్రేమను చూపునటుల ప్రార్థించుదము.




3. సకల విశ్వాసులు మనుష్యావతారుడైన శ్రీయేసుని సాక్ష్యులుగా రూపొందునటుల ప్రార్థించుదము.




4. తల్లిదండ్రులు తమ బిడ్డలను దివ్యవరప్రసాద జీవితానికి అర్పించి, దేవుని బిడ్డలుగా వారిని పెంచునటుల ప్రార్థించుదము.




5. క్రైస్తవ తల్లిదండ్రులు, తమ బిడ్డలను, మాటలలోను క్రియలలోను దేవుని రాజ్యంనకు చైతన్య పూరితమగు సాక్షులుగా రూపొందుటకు ప్రేరణను, స్ఫూర్తిని ఇచ్చునటుల ప్రార్థించుదము.




6. క్రొత్తగా బాప్తిస్మం పొంది నీటివలన ఆత్మవలన నూతనంగా జన్మించినవారు, చురుకుగా దేవుని కుమార్తెలుగా, బిడ్డలుగా ప్రేమతో జీవించునటుల ప్రార్థించుదము.




7. యువతీ యువకులు స్వచ్ఛమైన పవిత్ర ప్రేమతో వైవాహిక జీవితంలోనికి ప్రవేశించునటుల ప్రార్థించుదము.




8. బాప్తిస్మం నొందిన ప్రతీ క్రైస్తవుడు, క్రైస్తవురాలు తమ జీవితాదర్శం ద్వారా దేవుని వాక్యాన్ని ప్రకటించు బాధ్యతను గుర్తెరుగునటుల ప్రార్థించుదము.




9. సకల క్రీస్తు విశ్వాసులు, వలస వచ్చిన వారియందు మరియు ఆశ్రితుల యందు క్రీస్తు ముఖంను చూసి వారికి పరిచర్యలు చేయునటుల ప్రార్థించుదము.




10. దివ్య సత్ప్రసాదమును స్వీకరించువారందరు, అత్యంత గౌరవ ఆరాధనా భావాలతో, యేసుని నిజ సాన్నిధ్యంనందు దృఢ విశ్వాసము కలిగి దివ్య సంస్కారమును స్వీకరించు నటుల ప్రార్థించుదము.

11. వివిధ సమస్యలతో సతమతమవుతున్నవారు శ్రీయేసుని శ్రమలను చూసి, ఉపశమనమును, బలమును పొందునటుల ప్రార్థించుదము.

12. పేదలు, బలహీనులు, న్యాయస్థానంలో తగిన న్యాయంను, సామాజిక గౌరవమును పొందునటుల ప్రార్థించుదము.

13. హానికర అలవాట్లు, వ్యసనాల ప్రభావంతో పీడింపబడుచున్న యువతీ యువకులు తమ విమోచకుడుగా శ్రీయేసుని ఆశ్రయించి, నూతన జీవన విధానమును అలవర్చుకొనునటుల ప్రార్థించుదము.

14. నిరుద్యోగులు, నిరాశ్రయులు, అప్పుల భారంతో క్రుంగిపోతున్నవారు, మరి ముఖ్యంగా పేద రైతులు మున్నగు నిర్భాగ్యులకు ప్రభుత్వంవారు ఉపశమనమును, పునరావాసంను కలిగించునటుల ప్రార్థించుదము.

15. విశ్వాసం కొరకు హింసింపబడుతున్నవారు సిలువకు కొట్టబడిన శ్రీయేసుని చూచి కృపను, దీవెనను, బలమును పొందునటుల ప్రార్థించుదము.

16. మరణించిన సకల ఆత్మలు దేవుని కరుణను, పరిపూర్ణ విమోచనను పొందునటుల ప్రార్థించుదము.

17. దీర్ఘకాలిక వ్యాధులవలన మరణావస్థలోనున్న వారు తమ పాపములకు క్షమాపణను పొంది పరలోకంను చేరి నిత్య విశ్రాంతిని పొంద అర్హులగునటుల ప్రార్థించుదము.

18. సత్యాన్ని అన్వేషిస్తున్నవారు పరిశుద్ధాత్మ వరములను, ఫలములను పొందునటుల ప్రార్థించుదము.

19. ఇహలోక భౌతిక స్థిర చరాస్తుల యాజమాన్యంను నిర్వహించుచున్నవారు, మరియమాత విజ్ఞాపనా ప్రార్థనల వలన, వారికి అప్పగింపబడిన ఆస్తులను సక్రమంగా కాపాడి వృద్ధి చేయునటుల ప్రార్థించుదము.

20. నిరంతర జపమాల ప్రార్థనలో పాల్గొనుచున్న వారందరూ అనుదిన జీవిత సవాళ్లు, ఒడుదుడుకుల మధ్య క్రైస్తవ జీవన పరమార్థమును గ్రహించి చివరకు పరలోకంలో మరియమాతతోసహా మహిమను పొందు అర్హులగునటుల ప్రార్థించుదము.


## కొండగుడిలో భక్తిపూర్వక జపమాల ప్రార్థన

ప్రతి నెల మొదటి శనివారము
ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 3.30 గం॥ల వరకు - **ఉపవాస ప్రార్థన**
సా॥ 6.00 గం॥లకు - **ఫాతిమామాత తేరుతో ప్రదక్షిణ**

ప్రతి నెల రెండవ శనివారము మరియు చివరి ఆదివారము
ఉ॥ 10.00 గం॥ నుండి సా॥ 3.30 గం॥ల వరకు
**అఖండ జపమాల**


**డైరెక్టర్**

విశాఖపురి మేరిమాత పుణ్యక్షేత్రం
కొండగుడి, రాస్‌హిల్,
విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530 001.
PH : 0891 -2562318, Cell : 9573709412
Web. : www.rosarychainprayer.com
www.rosshillshrine.org


కలసి జపించు కుటుంబము కలకాలము నిలుచును

# నిరంతర జపమాల ప్రార్థన

2019

